నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 26 మార్చి 2025 | HYDERABAD

వాహనదారుడికి హెల్మెట్ అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

ఒకే వాహనం.. 67 పెండింగ్ చలాన్లు

దుండిగల్, మార్చి 25: 67 పెండింగ్ చలాన్లలో తిరుగుతున్న ఓ ద్విచక్ర వాహనాన్ని జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. చలాన్ల మొత్తం రూ.20 వేలు ఉండగా రూ.10 వేలు వసూలు చేశారు. మరో 16 చలాన్ల కింద రూ.10 వేలు చెల్లించాల్సి ఉండగా ద్విచక్ర వాహనదారుడు తాపీ మేస్త్రీ కావడంతో మానవతా దృక్పథంతో మరోసారి వసూలు చేయాలని నిర్ణయించారు. తలకు హెల్మెట్ ధరించకపోవడం వల్లనే చలాన్లు పడడంతో సీఐ శ్రీనివాస్ వాహనదారుడికి బహుమతిగా ఒక హెల్మెట్ కొని ఇచ్చారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందిగా కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ సంఘటన జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూరారం చౌరస్తాలో మంగళవారం వెలుగులోకి వచ్చింది.

పూడికతీత పనులు ప్రారంభిస్తాం

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): నాలా పూడికతీత పనుల టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి వెంటనే పనులను ప్రారంభిస్తామని జీహెచ్ ఎంసీ ఇంజినీరింగ్ (నిర్వహణ) విభాగం అధికారులు మంగళవారం తెలిపారు. ఈ ఏడాదిలో రూ.55 కోట్లతో 203 చోట్ల పనులు చేపడుతున్నామని, 120 చోట్ల పూడిక తీత పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన 83 చోట్ల పనులను టెండర్ల ప్రక్రియ ముగింపులో ఉందని, త్వరలోనే ఈ పనులు మొదలు పెడతామని తెలిపారు. ఈ నెల 23న నాలా పూడికతీత పనుల్లో అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ 'ఈ సారి వరద ముంపు తథ్యం' అనే శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. వర్షాకాలం ప్రారంభం నాటికల్లా పూడికతీత పనులను పూర్తి చేసి వరద నివారణ చర్యలు చేపడుతామన్నారు. నాలా ప్రమాదాలు, చెత్త వేయకుండా సంబంధిత జోనల్ కమిషనర్లకు అప్రమత్తం చేశామని తెలిపారు. నాలాల్లో చెత్త వేసే వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. నీరు నిలిచే ప్రాంతాలపై హైడ్రాతో కలిసి పనిచేస్తామని అధికారులు తెలిపారు.

మహిళలకు రక్షణేదీ!

ఆగని లైంగికదాడులు.. వరుస ఘటనలతో నగరవాసుల్లో భయం

నిఘా వైఫల్యమే కారణం

నగరంలో మూడొంతుల కేసులు

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ఎంఎంటీఎస్ రైలులో ఒంటరిగా ఉన్న యువతిపై ఓ గుర్తు తెలియని యువకుడు లైంగికదాడికి యత్నించగా తప్పించుకునే ప్రయత్నంలో యువతి రైల్లో నుంచి బయటకు దూకి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అదేవిధంగా హైదరాబాద్ నగరంలో బాలీవుడ్ టీవీ నటిపై దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈనెల 18న ఓ షాప్ ప్రారంభోత్సవానికి నగరానికి వచ్చిన ఆ నటి మాసబ్ ట్యాంక్ శ్యామ్‌నగర్ కాలనీలో బస చేశారు. 21న ఇద్దరు మహిళలు ఆమెను వ్యభిచారం చేయాలంటూ ఒత్తిడి తేవడంతో ఆమె వారితో గొడవ పెట్టుకుంది. ముగ్గురు వ్యక్తులు గది వద్దకు వచ్చి తమతో గడపాలంటూ ఆమెపై ఒత్తిడి చేశారు. ఎదురుతిరిగిన ఆమెపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో మాసబ్ ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో క్రైమ్‌రేట్ పెరిగింది. సంవత్సరకాలంగా నగరంలో జరుగుతున్న ఘటనలు చూస్తే నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జరుగుతున్న ఘటనలు సిటీలోనే జరుగుతుండటం నేరస్తులు పోలీసులకు సవాల్ విసురుతున్నారా అని అనిపిస్తుంది. అతివల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీటీమ్స్ ఒకవైపు సమర్థవంతంగా పని



చేస్తూ ఆకతాయిల ఆటకట్టిస్తున్నా.. వేధింపులు, లైంగికదాడులు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

పనిచేయని సీసీ కెమెరాలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రతకు ఎన్నిచట్టాలు రూపొందిస్తున్నా.. అతివలు, పిల్లలపై వేధింపులు, దాడులకు అడ్డుకట్ట పడటం లేదు. ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ అక్షరాస్యత ఎక్కువగా ఉందని చెప్పుకునే హైదరాబాద్‌లోనే వివిధ కేసుల నమోదు శాతం ఎక్కువగా ఉంది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలతో పోలిస్తే గ్రేటర్ సిటీలోనే మూడొంతుల కేసులు నమోదవుతున్నట్లు సమాచారం. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సగటున రోజుకు మూడు కేసులు వస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఈ కేసులు పెరగడానికి ప్రధానంగా నిఘా వైఫల్యమే కారణమని నగరవాసులు అంటున్నారు. ఎంఎంటీఎస్ ఘటనలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, పెద్దగా నిఘా లేకపోవడం కారణమైతే.. చాలా ఘటనల్లో పోలీసులు అనుసరిస్తున్న ఉదాసీనత కారణంగా నేరస్తులు చెలరేగిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా పెట్రోలింగ్ వెహికిల్స్ ఎప్పటికప్పుడు తమ పరిధిలో జరుగుతున్న ఘటనలపై దృష్టి పెట్టకపోవడం, నిఘా వర్గాలు తమ ఏరియాల్లో జరిగే వ్యవహారాలను పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయని అంటున్నారు.

అతివలే బలి..

హైదరాబాద్‌లో జరుగుతున్న నేరాల్లో ఎక్కువగా బాధితులుగా ఉంటున్నది మహిళలే అని పోలీసులు ఆఫ్‌ద రికార్డుగా చెబుతున్నారు. ఆర్థికసమస్యలు, అక్రమసంబంధాలు, ప్రేమవ్యవహారం.. కారణమేదైనా అతివలే సమిధలుగా మారుతున్నారు. ప్రధానంగా ఇంట్లోనే ఉండి ఉపాధి పొందుతూ ఆదాయాన్ని ఆర్జించండి అంటూ నేరస్తులు వారికి వల విసురుతున్నారు. మాయమాటలు చెప్పి బెదిరిస్తూ వారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో వారానికి ఒకరిద్దరు మహిళలు సైబర్‌నేరాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. చాలా ఘటనలు బయటకు రాకపోవడానికి కూడా మహిళల మనస్తత్వాలే కారణమని వారు చెబుతున్నారు. చాలా ఆలస్యంగా వెలుగుచూసిన ఘటనల్లో తాము కౌన్సెలింగ్ చేసినప్పుడు వారు చెప్పే విషయాలు విస్తుగొలుపుతున్నాయని వారు పేర్కొన్నారు. సమస్య మొదలైనప్పుడే బయటకు వస్తే ఏం జరుగుతుందోనన్న భయంతో 50 శాతం మంది మౌనం వహిస్తున్నారని తెలుస్తుంది.

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2024లో నమోదైన కేసులు

కట్నం కోసం హత్యలు	3
వరకట్నపు మరణాలు	12
ఆత్మహత్యకు ప్రేరేపించడం	15
లైంగికదాడులు	584
కిడ్నాప్‌లు	62
వేధింపులు, గృహహింస	813

అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు

న్యాయవాది హత్యపై నిరసనల వెల్లువ

అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

నాంపల్లి కోర్టు న్యాయవాదుల అరెస్టు

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా మంగళవారం నాంపల్లి కోర్టులకు చెందిన న్యాయవాదులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం పోలీసుల నిర్బంధం మధ్య కొనసాగింది. నినాదాలతో అసెంబ్లీ ప్రాంతానికి బయలుదేరిన న్యాయవాదుల్ని పబ్లిక్ గార్డెన్ ఎదురుగా అడ్డుకుని పోలీసులు చుట్టుముట్టారు. అసెంబ్లీ ముట్టడికి అడ్డుకట్ట వేయరాదని పోలీసుల్ని కోరినప్పటికీ బలవంతంగా న్యాయవాదుల్ని ప్రత్యేక వాహనాల్లో అరెస్టు చేసి అంబర్‌పేట్, ఐఎస్ సదన్, కాంచన్‌బాగ్, బండ్లగూడ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... న్యాయవాదిని అతి కిరాతకంగా నడిరోడ్డు మీద హత్య చేశారని, ఇలాంటి సంఘటనలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలుమార్లు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని వినతిపత్రాన్ని సైతం సమర్పించినా ఉలుకూ-పలుకూ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది డి.అనంతరఘు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి చెందిన కేసుల్ని వాదిస్తున్నది న్యాయవాదులేనని, న్యాయవాదుల్ని నడిరోడ్డుపై హత్య చేస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో తక్షణం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు రవికిశోర్, వేణుగోపాల్, మహిళా న్యాయవాది ప్రొనీత్‌సింగ్, డి.అనంతరఘు, డి.వెంకటేష్‌తో పాటు సుమారు వంద మందిని అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలి

అంబర్‌పేట : న్యాయవాదుల రక్షణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ ను వెంటనే తీసుకురావాలని పలువురు నాంపల్లి క్రిమినల్ కోర్టు (వివరాలు IIలో)

ఆర్ కృష్ణయ్య ..రాజీ కృష్ణయ్య

బీసీలకు క్షమాపణ చెప్పాలి : ఐక్య బీసీ సంఘాల నేతల హెచ్చరిక 2

గంజాయికి బానిసై..

పోలీసుల అదుపులో ఎంఎంటీఎస్ నిందితుడు!

నిందితుడు మహేశ్

సిటీబ్యూరో/మారేడ్‌పల్లి, మార్చి 25(నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ – మేడ్చల్ ఎంఎంటీఎస్ ఘటనలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతుంది. తీవ్రంగా గాయపడిన బాధితురాలి వాంగ్మూలం తీసుకున్న పోలీసులు విచారణ వేగవంతం చేశారు. నిందితుడు ఎవరనే దిశగా పాత నేరస్తుల ఫొటోలను బాధితురాలికి రైల్వే పోలీసులు చూపించారు. ఫొటోలను చూసిన బాధితురాలు జంగం మహేశ్ అనే వ్యక్తిని చూసి ఇతడే అని గుర్తించింది. ఆమె కొంత అనుమానాస్పదంగా చెప్పడంతో పోలీసులు మరికొందరు అనుమానితులను చూపించారు. వారెవరూ కాదనడంతో మహేశ్ కోసం పోలీసుల గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడి కోసం 17 పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. 4 రైల్వే టీంలు, 13 సైబరాబాద్ టీంలు మహేశ్ కోసం వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి విషయంలో బాధితురాలు చెప్పిన ఆనవాళ్ల ప్రకారం నల్లగళ్లకొక్కా వేసుకున్న వ్యక్తిగా గుర్తించిన పోలీసులు 150 నుంచి 200 వరకు సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. మేడ్చల్ జిల్లా గౌడవెల్లికి చెందిన జంగం మహేశ్ గంజాయికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడని, ఇతడిపై గతంలో కూడా కేసులున్నాయని పోలీసులు తెలిపారు. సంవత్సరం కిందటే మహేశ్ భార్య అతడిని వదిలేసి వెళ్లిందని, తల్లిదండ్రులు కూడా చనిపోవడంతో మహేశ్ గంజాయి తాగుతూ చిన్నచిన్న నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మేడ్చల్ వరకు సీసీలే లేవు..!

సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు మొత్తం 28 కిలోమీటర్ల మేర 14 స్టేషన్లు ఉన్నాయి. సికింద్రాబాద్, మల్కాజిగిరిలో తప్ప మిగతా చోట్ల కెమెరాలే లేవు. ఒకచోట కేవలం బుకింగ్ పాయింట్ వద్ద ఉన్నప్పటికీ అది కూడా పనిచేయడం లేదని రైల్వే పోలీసులు చెబుతున్నారు. సికింద్రాబాద్, మల్కాజిగిరి స్టేషన్లలో ప్లాట్‌ఫామ్‌ల సీసీ కెమెరాలను పరిశీలించినప్పటికీ ఎక్కడా నిందితుడి ఆనవాళ్లు కనిపించలేదు. అల్వాల్, కొంపల్లి, మేడ్చల్ వద్ద స్టేషన్ వెలుపల కొన్ని ప్రైవేట్ సీసీ ఫుటేజ్‌లు తీసుకుని నిందితుడి ఆనవాళ్లను గుర్తించామని ఒక పోలీస్ అధికారి తెలిపారు. నిందితుడు అల్వాల్‌లో ట్రైన్ ఎక్కినట్లుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

నిందితుడి ఇంటి వద్ద నిఘా..

నాలుగు పోలీస్ బృందాలు గౌడవెల్లిలో నిందితుడి ఇంటి వద్ద నిఘా పెట్టారు. సోమవారం రాత్రి సమయంలో నిందితుడిని ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా సమాచారం. బాధితురాలికి మహేశ్‌ను దూరం నుంచి చూపించి అతడే అని నిర్ధారించిన తర్వాత ప్రస్తుతం విచారిస్తున్నట్లుగా తెలిసింది. పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పుడు కూడా మత్తులోనే ఉన్నాడని ఒక అధికారి తెలిపారు. ఆ సమయంలో మహేశ్ ఎక్కడికి వెళ్లి వస్తున్నాడు.. ఎందుకు ఆ అమ్మాయిపై అఘాయిత్యం చేయాలనుకున్నాడనే దిశగా పోలీసులు ఆరా తీస్తున్నారు. మహేశ్ అరెస్ట్ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

గౌడవెల్లి వాసిగా గుర్తింపు

మేడ్చల్: ఎంఎంటీఎస్‌లో ప్రయాణిస్తున్న యువతిపై లైంగిక దాడికి యత్నించిన ఘటనలో నిందితుడిని పోలీసులు గుర్తించి, అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుడి ఫొటోను బాధితురాలు గుర్తించడంతో రైల్వే పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిని మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి గ్రామానికి చెందిన మహేశ్‌గా గుర్తించారు. మహేశ్ తల్లిదండ్రులు యాదగిరి, ప్రమీల మృతి చెందాడు. మహేశ్ ఏం పని చేయకుండా మద్యం, గంజాయికి బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నట్టు సమాచారం.

మామిడిపల్లిలో ఆస్తిపన్ను చెల్లించలేదని డ్రైనేజీ సీజ్ చేస్తున్న సిబ్బంది

ఆస్తి పన్ను చెల్లించకపోతే డ్రైనేజీ కట్

బడంగ్‌పేట్, మార్చి 25: ఆస్తి పన్ను చెల్లించని వారి ఇండ్ల కు డ్రైనేజీని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కట్ చేస్తున్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు పేద ప్రజలు నివాసముండే బస్తీలలో డ్రైనేజీ లైన్లు మూసివేస్తున్నారు. కోట్ల బకాయి ఉన్నవాళ్లను వదిలేసి పేదలు ఆస్తిపన్ను చెల్లించడం లేదన్న ఉద్దేశంతో డ్రైనేజీ కట్ చేయడం ఏమిటని బాధితులు మున్సిపల్ కమిషనర్ సరస్వతిని ప్రశ్నించారు. 70 గజాల ఇల్లు ఉన్న వారిని కూడా వదిలిపెట్టకుండా డ్రైనేజీ లైన్ కట్ చేయిస్తున్నారు. మున్సిపల్ సిబ్బందితో వారి ఇండ్ల ఎదుల బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. వారిని అవమానించే విధంగా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా డ్రైనేజీ పైప్ లైన్ ను సీజ్‌చేయడంపై కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సర కాలమంతా పట్టించుకోకుండా కేవలం మార్చి నెలలోనే అధికారులు హడావుడి చేయడంపై ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా వచ్చిన అధికారి శ్యాంసుందర్ పేదల ఇండ్లకు డ్రైనేజీ కట్ చేయాలని కంకణం కట్టుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇదంతా కమిషనర్ సరస్వతి ఆదేశాల మేరకు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ. 39.52 కోట్లు వసూలు చేయవలసి ఉంది. ప్రస్తుతం 42 శాతమే వసూలైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలింది రెండు రోజులే. మరో రెండు రోజులు ఉగాది, రంజాన్ ఉన్నందున ఆస్తిపన్ను పూర్తిస్థాయిలో వసూలయ్యే అవకాశం కనిపించడం లేదన్న ఉద్దేశంతో డ్రైనేజీ లైన్లు కట్ చేసే పనిలో పడ్డారు. మార్చి 31 వరకు ఆస్తి పన్నులు వసూలు చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా గతంలో డ్రైనేజీ సీజ్ చేసిన దాఖలాలు లేవని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విమానంలో ప్రయాణికుడి హల్‌చల్

అత్యవసర డోర్ ఓపెన్ చేసేందుకు యత్నం

తప్పిన పెనుప్రమాదం.. ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు

శంషాబాద్ రూరల్, మార్చి 25: విమానంలో ఓ ప్రయాణికుడు హల్‌చల్ చేసి ప్రయాణికులకు భయాందోళనకు గురిచేసిన సంఘటన మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సౌదీ అరేబియా(దామన్)నుంచి మంగళవారం ఉదయం 8.15 ఇండిగో విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నది. ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సమయంలో విమానం గాల్లో ఉండగానే సీటు నంబర్ 19ఎఫ్‌లో ఉన్న ఉస్మాన్ అనే ప్రయాణికుడు అత్యవసర ద్వారం (డోర్) తెరిచే ప్రయత్నం చేశాడు. గమనించిన ఎయిర్‌లైన్స్ సిబ్బంది అపూర్వ ప్రయాణికుడిని వారించారు. అయినా అతడు వినకపోవడంతో సిబ్బంది ఎయిర్‌లైన్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విమానంలో ఉన్న ప్రయాణికుడు భయాందోళనకు గురయ్యాడు. దీంతో పాటు పైలెట్ విమానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. అనంతరం ఎయిర్‌లైన్స్ ఉద్యోగి సుజన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రయాణికుడు మహ్మద్ ఉస్మాన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సదరు ప్రయాణికుడు కాల ఫత్తర్ చార్మినార్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బడ్జెట్‌లో రాజధానికి అన్యాయం

హైదరాబాద్‌కు 3 శాతం నిధులు మాత్రమేనా!

దాహార్తి తీర్చాలంటే కొత్త రిజర్వాయర్లు అవసరం

అసెంబ్లీలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

సిటీబ్యూరో, మార్చి25, (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రానికి ఆదాయవనరుగా ఉన్న రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని మొత్తం బడ్జెట్‌లో రూ.9,560 కోట్లతో 3 శాతం నిధులను మాత్రమే కేటాయించడమేంటని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నించారు. కేటాయింపులను వివరిస్తూ ఆయన మాట్లాడారు. జలమండలికి కేటాయించిన రూ. 3,385 కోట్లలో రూ.650 కోట్లు రుణాల చెల్లింపునకు, రూ.1,000 కోట్లు వడ్డీ, ఇతర ఖర్చులకు కేటాయించగా, కొత్త ప్రాజెక్టులకు డబ్బులు మిగలడం లేదని గుర్తు చేశారు. గ్రేటర్‌లో నీటి సరఫరా కోసం కొత్త రిజర్వాయర్లు, పాత పంపుల పునరుద్ధరణ అత్యవసరమన్నారు. ప్రతిరోజు 690 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరమవుతుండగా, ప్రస్తుతం నగరానికి రోజుకు 550 మిలియన్ గ్యాలన్ల మంచినీరు మాత్రమే సరఫరా అవుతుందని గుర్తుచేశారు. జీహెచ్‌ఎంసీ ప్రతి నెల రూ. 8.32 కోట్లు జలమండలికి చెల్లించాల్సి ఉండగా వాటిని చెల్లించపోవడంతో ఇప్పటివరకు రూ.102 కోట్ల బకాయిలు జమయ్యాయని తెలిపారు. మురుగునీరు నిర్వహణకు నిధుల కొరత ఉందని. అదనంగా రూ.1,500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో రోడ్లు, బ్రిడ్జిలు, రైల్వే అండర్‌పాస్‌లు , ఓవర్‌పాస్‌ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, మల్కాజిగిరి నియోజక వర్గం రైల్వే చక్రబంధంలో ఉంటుందని, 2022లో నేషనల్ లెవెల్ క్రాసింగ్ గుర్తింపు వచ్చినప్పటికీ నేటికీ అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదని వెల్లడించారు. రైల్వే బ్రిడ్జిల నిర్మాణపు అభివృద్ధి పనులు జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం 42 ఎకరాల భూమిని కంటోన్మెంట్‌కు ఇవ్వాలని లేదా సమాన విలువ ఉన్న భూమిని కేటాయించాలని సూచించారు. హైదరాబాద్‌లో పబ్లిక్ టాయిలెట్లు నిర్వహణకు రూ.38 కోట్లు ఖర్చు పెడుతున్నారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో హైడ్రా ప్రాజెక్ట్ పేరుతో కొందరు అక్రమాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని గర్తుచేశారు. జీహెచ్‌ఎంసీకి అధిక నిధులు కేటాయించాలని, జలమండలికి రూ.1,500 కోట్లు మంజూరు చేయాలని, మల్కాజిగిరి లోని ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ కల్పించాలని, ఎంఎంటీఎస్ ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 254 కోట్ల షేర్ పూర్తిగా చెల్లించాలని ప్రభుత్వానికి ఆయన తెలిపారు.

గందరగోళంగా ఎల్ఆర్ఎస్

అధికారుల తొందరపాటుతో తప్పులు

పరిశీలన చేయకుండానే స్టేటస్ అప్‌డేట్

ఎల్ 1 దశలోనే లక్షకు పైగా దరఖాస్తులు

వారంలో ముగియనున్న గడువు

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)లో చిత్ర విచిత్రాలు చోటుచేటుకుంటున్నాయి. ఖజానా నింపుకోవాలనే క్రమంలో అధికారుల తొందరపాటుతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మూడు దశల్లో జరగాల్సిన ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలనే క్రమంలో ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టుగా దరఖాస్తుల తీరు మారుతుంది. ప్రభుత్వం కూడా క్రమబద్ధీకరణ చేసి జనాలకు లబ్ధి చేయాలనే భావన కంటే.. ఖజానా నింపుకోవాలనే ఉద్దేశమే ఈ తప్పులకు కారణమవుతుందని రియల్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గడువు ముంచుకొస్తున్న దరఖాస్తుల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. హెచ్‌ఎండీఏ పరిధిలో 3.5లక్షల మంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరించాలని దరఖాస్తు చేసుకోగా లక్షకు పైగా దరఖాస్తులు ఇప్పటికి ఎల్1(ప్రాథమిక) దశలోనే ఉన్నాయి. గడిచిన నాలుగున్నరేళ్లుగా ఈ దరఖాస్తుల్లో ఎలాంటి కదలిక లేకపోవడంతో అధికారులు వీటిపై దృష్టి పెట్టలేదు. కేవలం భవన నిర్మాణ అనుమతులు అవసరమైన వారు మాత్రమే.. అధికారులను ఆశ్రయించి, దరఖాస్తుల్లో దొర్లిన తప్పొప్పులను సరిచేసుకుని నిర్మాణాలను చేపట్టారు. ఈ క్రమంలో అవసరమైన పెనాల్టీలు కట్టిన వారు కూడా జాబితాలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాట్లను క్రమబద్ధీకరించి సొమ్ము చేసుకోవాలనే లక్ష్యంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు నోటిఫికేషన్ ఇవ్వడంతో.. దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే అధికారులు అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో సంబంధిత దరఖాస్తుల పురోగతి(స్టేటస్) గందరగోళంగా మారింది.

ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టుగా...

మూడు దశల వడపోతల తర్వాత ఫీజు చెల్లించాలని సమాచారం చేరవేయాల్సి ఉంది. కానీ అధికారుల తప్పిదం వలన సమీపంలో లేని ప్రభుత్వ భూములు, చెరువు భూములు (వివరాలు IIలో)

పాతనగరంలో సవాల్‌గా హెచ్‌సిటీ ప్రాజెక్టు

భూ సేకరణకు ససేమిరా అంటున్న బాధితులు

రహదారుల విస్తరణకు 1391 ఆస్తుల గుర్తింపు

టీడీఆర్‌లు మాకొద్దు .. నగదు ఇస్తేనే ఆస్తులిస్తం..బాధితులు

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హెచ్‌సిటీ ప్రాజెక్టు ఆదిలోనే అబాసుపాలవుతుంది. ట్రాఫిక్ రద్దీ నివారణలో భాగంగా పలు చోట్ల రహదారులను విస్తరించాలని నిర్ణయించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనుల్లో భాగంగా పలు చోట్ల భూ సేకరణ అనివార్యమైంది. 1391 చోట్ల ఆస్తులను గుర్తించిన అధికారులు భూ సేకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ అభివృద్ధి పథకాలకు చేపట్టే భూ సేకరణ సందర్భంగా ఇచ్చే నగదు నష్ట పరిహారానికి బదులుగా ప్రవేశపెట్టిన ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అమలు చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే టీడీఆర్‌లకు ఇక్కడి బాధితులు ఒపుకున్నారు. నగదు రూపంలో నష్ట పరిహారం అందజేస్తేనే రహదారి విస్తరణ పనులకు సహకరిస్తామని తేల్చి చెబుతున్నారు. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న బల్దియాకు ప్రభుత్వ నుంచి నిధులు మంజూరు జరగకపోవడం, ప్రాజెక్టు పనులు ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలో అని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. మొత్తంగా పాతబస్తీలో భూ సేకరణ కష్ట సాధ్యంగా మారడం, హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు ఇప్పట్లో మొదలయ్యే పరిస్థితులు కనబడడం లేదని ఇంజినీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ అభివృద్ధి పథకాలకోసం చేపట్టే ఆస్తుల సేకరణ సందర్భంగా జీహెచ్‌ఎంసీ టీడీపీఆర్ పత్రాలను (వివరాలు IIలో)

వేడినీటి బకెట్‌లో పడి బాలుడి మృతి

బన్నీ(ఫైల్)

జవహర్‌నగర్, మార్చి 25: ఆడుకుంటున్న బాలుడు ఒక్కసారిగా వేడినీటి బకెట్‌లో పడటంతో ఛాతికి తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మంగళవారం మ